క్లుప్తంగా

నేటి నుంచి కాంగ్రెస్ నాయకుల సమీక్ష

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 7,8న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లోని ఆయన నివాసంలో చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కడ్తాల్, మధ్యాహ్నం 2 గంటలకు ఆమనగల్లు, 8న ఉదయం 9 గంటలకు తలకొండపల్లి మండలం, మధ్యాహ్నం 2 గంటలకు మాడ్గుల మండల నాయకులతో సమీక్షించనున్నారు.

అమ్మవారికి వేతనం వితరణ



చెక్ రూపంలో విరాళం అందజేస్తున్న తేజస్విని కుటుంబ సభ్యులు

యాచారం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. తన మొదటి నెల వేతనాన్ని నందివనపర్తి జ్ఞాన సరస్వతి ఆలయాభివృద్ధికి వితరణ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి ఆరుట్ల గ్రామానికి చెందిన భార్గవి, వెంకట్‌రెడ్డి దంపతుల కుమార్తె తేజస్విని.. యూఎస్‌లో ఉద్యోగం చేస్తోంది. అమ్మవారి దీవెనలతోనే విదేశంలో కొలువు లభించిందని పేర్కొంటూ.. తన జీతం డబ్బులు రూ.1,01.116ను సోమవారం .. ఆలయ ఫౌండర్ సదా వెంకట్‌రెడ్డికి అందజేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రాఘవేంద్రశర్మ.. యువతి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.

పథకాలను వివరిద్దాం.. పార్టీని గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యాచారం: ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మస్కు నర్సింహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఆరు గ్యారంటీలు అందజేస్తున్నామని, వాటిని ప్రజల్లో తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు రాంరెడ్డి, రామకృష్ణ, నాయకులు అమృతాసాగర్, మోతిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

కడ్తాల్: పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్ ఆధ్వర్యంలో.. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రవి, రామోజి, శివయ్య, శ్రీశైలం, రామకృష్ణ, మల్లయ్య, పాండు, రవిలు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరత్ నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



జలమండలి డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి కాలనీల్లోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సాహెబ్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ బలరాం, డీజీఎం సన్యాసిరావులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డాక్టర్స్ కాలనీ, బాపునగర్, చాడీ, భగత్‌సింగ్‌నగర్, నర్సింహపురికాలనీ, అంబేడ్కర్‌నగర్, శ్రీనివాస కాలనీల్లో సీవరేజ్ పైపులైన్, మ్యాన్‌హోల్ ఛాంబర్ పునరుద్ధరణ పనులపై చర్చించి త్వరగా సమస్యల పరిష్కారం కోసం పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందేలా కృషి చేయాలని కోరామని తెలిపారు.



ఆరుట్ల పెద్ద బంధం చెరువు



చెన్నారెడ్డి గూడ చెరువు

గ్రామాలకు జలకళ

కనువిందు చేస్తున్న చెరువులు, కుంటలు
- పెరిగిన భూగర్భ జలాలు
- తీరిన సాగు కష్టాలు

మంచాల: ఎడతెరపి లేని వర్షాలతో చెరువు, కుంటలకు జలకళ సంతరించుకుంది. సెప్టెంబర్‌కు ముందు వెలవెలబోయినప్పటికీ.. ప్రస్తుతం కనువిందు చేస్తున్నాయి. మండలంలో ఆ నెలలో కురవాల్సిన వర్ష పాతం కంటే ఎక్కువగా నమోదు అయింది. సాధారణంగా సెప్టెంబర్‌లో 142.7 సెంటీ మీటర్లు వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా.. అధిక వర్షాలతో 215.0 సె.మీ. నమోదు అయింది. అదే నెల 12న 47.6, 19న 31.8 సె.మీ. నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

భారీ ఊరట..

గుట్టల ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఆరుట్ల గ్రామంలోని గంగాదేవి వాగు, దూకుడు వాగుల నుంచి వర్షపు నీరు రావడంతో పెద్ద బంధం చెరువు నిండిపోయింది. చిన్నబంధంలోకి నీరు చేరుతోంది. అదే విధంగా పటేల్ చెరువు, గంగ చెరువు, పడమటి చెరువు, పాయిల్ చెరువు, నాటకాని చెరువులు నిండిపోయాయి. చెన్నారెడ్డి గూడ, బోడకొండ గుట్ట మధ్య నుంచి వచ్చే తెల్లవాగు జోరుగా పారుతోంది. మంచాల సమీపాన రెండు చెరువుల్లో నీరు చేరింది. ఇలా మండలంలోని 25 చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. భూగర్భ జలాలు పెరిగాయి. బోరు బావుల్లో నీటి శాతం పెరిగింది. రైతులకు ఊరట లభించింది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



కాలనీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడ్తాల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో.. సోమవారం సమగ్రత భద్రతా ఏర్పాట్లలో భాగంగా.. మండల కేంద్రంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు చేపట్టడంతో పాటు, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ప్రశాంతంగా, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఎవరైనా అల్లర్లు, గందరగోళం సృష్టించే ప్రయత్నాలు చేస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా అనధికారికంగా మద్యం విక్రయించి, అధిక ధరలకు అమ్మినా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. గంజా, మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం ఇచ్చిన వారి.. వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆమనగల్లు: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఆటల్లో పాల్గొని తమ సత్తాచూపాలని మెడికల్‌షాపు అసోసియేషన్ నాయకుడు పాపిశెట్టి రాము అన్నారు. పట్టణంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వస్పుల శివకుమార్ స్మారక క్రికెట్ టోర్నీ ముగిసింది. విజేత జట్లకు ఆదివారం రాత్రి రాము బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్ టీమ్ శివకు రూ.20 వేలు, రన్నర్ టీమ్ ఎం.కె.చాలెంజర్స్‌కు రూ.10 వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రభుశంకర్, శ్రీకాంత్, రాజు, చెన్నకేశవులు, మహేందర్, మహేశ్, అఫ్సర్, రమేశ్, సురేశ్, శివసూర్య పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్‌రూరల్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు పద్మ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అవసరమైన వారికి కంటి డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని ఆస్పత్రుల్లో వారానికి ఒక రోజు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత కంటి శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మికతతో ఒత్తిడికి ఊరట



పూజా కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు

మంచాల: భక్తిభావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి దాద్‌పల్లిలో రామాంజనేయ స్వామి నూతన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంతో ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఆధ్యాత్మికతతో కొంత ఊరట కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు నూకం రాజు, పాండాల జంగయ్య గౌడ్, శ్రీశైలం, చంద్రయ్య, బహదూర్, పుల్లరెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి



అల్మాస్‌గూడలోని మెయిన్ రోడ్డును పరిశీలిస్తున్న మల్లారెడ్డి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి

బడంగ్‌పేట్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయని, అధికారులతో మాట్లాడి మరమ్మతులకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ధ్వంసమై రోడ్లపై మురుగునీరు పొంగి పొర్లుతుండడంతో కాలనీవాసులతో ఆయన పరిశీలించారు. 24, 26 డివిజన్‌లలోని విశాఖనగర్–3, శ్రీసాయి హోమ్స్, వెంకటేశ్వరకాలనీ తదితర కాలనీల్లో డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడారు. కాలనీల్లో త్వరలో సమస్యలు పరిష్కారించేలా కృషి చూస్తామని హామీ ఇచ్చినట్లు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గోలి రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు రూపచారి, సందీప్‌రెడ్డి, చెవుల శ్రీను, రాజశేఖర్, గాంధీనాయక్, రాజు తదితరులు ఉన్నారు.

డ్రైనేజీని పూర్తిచేయించండి



బొడ్రాయికి పూజలు చేస్తున్న సబితారెడ్డి, గ్రామస్తులు

ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సుల్తాన్‌పూర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ 13వ డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బొడ్రాయికి స్థానికులతో కలిసి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులన్నీ త్వరలో పూర్తి చేయిస్తానని స్పష్టం చేశారు. డ్రైనేజీ సమస్యను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, కైసర్‌బామ్, శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మహ్మద్ అఖిల్, బొర్ర మాధవరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉబికి వచ్చిన గంగమ్మ



బోరులో నుంచి పైకి వస్తున్న నీరు

కేశంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. భూగర్భ జలాల మట్టం భారీగా పెరిగింది. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి వ్యవసాయ పొలంలో వృథాగా పడి ఉన్న బోరులో నుంచి సోమవారం నీరు ఉబికి పైకి వస్తున్నాయి. దీంతో బోరు బావిలో నుంచి నీరు వస్తున్న విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున అక్కడికి చేరుకొని పరిశీలించారు. వర్షాలు బాగా కురవడంతో భూగర్భజలాలు పెరిగి నీరు పైకి వస్తుందని ప్రజలు చర్చించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం



ఎమ్మెల్యే కసిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీ ఎన్నికల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు.. నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమష్టిగా పార్టీ విజయం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, రచ్చ శ్రీరాములు, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు



పోలీసుల అదుపులో సీపీఎం నాయకులు

ఆమనగల్లు: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం పార్టీ తలకొండపల్లి మండల కార్యదర్శి గుమ్మడి కురుమయ్య అన్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో నగరంలోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు వెళ్తున్న క్రమంలో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. కురుమయ్యతో పాటు.. శివశంకర్, లక్ష్మయ్య, నర్సింహులను పోలీసులు అరెస్టు చేసి, సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

పంచాయతీ పోరులో పోటీ

సీపీఎం మండల కార్యదర్శి శేఖర్

మహేశ్వరం: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తుందని మండల కార్యదర్శి ఎర్పుల శేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేస్తామన్నారు. పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో సీపీఎం ముందుంటుందన్నారు. ప్రజలు, కార్మికులు కమ్యూనిస్టుల వెంట నిలబడాలన్నారు. సీపీఎం బలపర్చిన అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు అలువాల రవి కుమార్, ప్రకాష్, జగన్, జంగయ్య పలువురు పాల్గొన్నారు.



బండమీది గూడూరు- కటికపల్లి రోడ్డు దుస్థితి



మాలగూడూరు- కటికపల్లి మార్గం..

రోడ్లు ‘ఛిద్రం’.. ప్రయాణం కష్టం

కురుస్తున్న వర్షాలతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడి, కంకర తేలి ఛిద్రమయ్యాయి. గుంతల్లో నీరు చేరి, వాహనదారులను ప్రమాదంలో పడేస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించాలంటే వెన్నులో వణుకుపుడుతోందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అంతర్గత దారులదీ అదే దుస్థితి.

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- అస్తవ్యస్తంగా అంతర్గత మార్గాలు
- ప్రమాదపుటంచులో ప్రయాణం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కందుకూరు: మండల పరిధి కటికపల్లి గ్రామానికి గూడూరు పరిధి బండ మీద గూడూరు నుంచి ఉన్న రెండు కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ రహదారిపై నిర్మించిన లో– లెవల్ బ్రిడ్జి సైతం ప్రస్తుత వానలతో వరద ప్రవహిస్తూ.. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మాలగూడూరు నుంచి ఉన్న రోడ్డు పరిస్థితి ఇదే విధంగా ఉంది. దీంతో ఆ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్వాన రోడ్లకు కనీస మరమ్మతులు చేయించేవారు లేక.. ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు తెలిపారు.

అసంపూర్తి రోడ్డు.. అవస్థల్లో ప్రజలు



డైనమిక్ కాలనీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మీర్‌పేట: ఉన్న రోడ్డును అభివృద్ధి పనుల పేరిట తవ్వారు. అనంతరం కొంత దూరం మేర.. రహదారి నిర్మాణం చేపట్టి.. మధ్యలోనే వదిలేశారు. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ మీర్‌పేట కార్పొరేషన్ పరిధి డైనమిక్‌కాలనీ రోడ్డు దుస్థితి. అలా వదిలేసిన రోడ్డుపై ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి.. తీవ్ర అసౌకర్యంగా మారింది. దీంతో ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని, అసలే సీజనల్ వ్యాధుల కాలం.. ఆపై రోడ్డుపై నిలిచిన నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

మట్టికొట్టుకుపోయి..



రావిర్యాల రోడ్డు దుస్థితి

తుక్కుగూడ: పుర పరిధి రావిర్యాల నుంచి ఔటర్ రింగు వైపు రోడ్డు ప్రమాదకరంగా మారింది. కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతికి రోడ్డుకు ఇరు వైపులా ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించబోయి ప్రమాదంలో పడుతున్నారు. అధికారులు స్పందించి, రోడ్డుకు ఇరువైపులా మరమ్మతు పనులు చేయించి, సమాంతరం చేయించాలని కోరుతున్నారు.

మొత్తం కచ్చరోడ్డే..



కటికపల్లి గ్రామానికి చేరుకునే రెండు వైపులా ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. పదేళ్ల క్రితం నిర్మించిన రహదారి అది. ఎన్నోగోతులు ఏర్పడ్డాయి. కంకర తేలి కచ్చరోడ్డును తలపిస్తోంది. అయినప్పటికీ.. ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. ఆ మార్గాల్లో పయనించాలంటే భయంగా ఉంది.

– నరేష్ ముదిరాజ్, కటికపల్లి

మరోమార్గం లేక..



అధ్వాన రోడ్డుతో ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాం. అటు బండమీదగూడూరు, ఇటు మాలగూడూరు రహదారులు నరకప్రాయంగా మారాయి. మరోమార్గం లేక.. ప్రమాదపుటంచులో పయనిస్తున్నాం. అధికారులు స్పందించి, రోడ్డు నిర్మించాలి.

– పురుషోత్తమ్, కటికపల్లి